సాక్షి ఒడిశా



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,59,178లు, బంగారం 1 గ్రాము 650 మిల్లీగ్రాము, వెండి 123గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



బోండా గిరిజనుల అభివృద్ధికి కృషి

మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి బోండా ఘాటీలో బుధవారం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు తొలిసారి పర్యటించారు.

- 8లో.



రిపబ్లిక్ వేడుకలకు ఎంపికలు

జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో 2026 జనవరి 26న జరుగనున్న రిపబ్లిక్ దినోత్సవాల్లో పాల్గొనేందుకు ప్రీ రిపబ్లిక్ డే సెలక్షన్ శిబిరం నిర్వహించారు.

- 8లో.

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025

న్యూస్‌రీల్

ఖరీఫ్ రుణాలు రూ.514 కోట్లు



జయపురంలోని కె.సి.సి బ్యాంక్ రీజనల్ కార్యాలయం

జయపురం: కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ జయపురం (కె.సి.సి.బ్యాంక్) ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రూ.645 కోట్ల మేరకు రుణాలను ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.514 కోట్లు అందజేసినట్టు బ్యాంకు వర్గాలు వెల్లడించాయి. అవిభక్త కొరాపుట్ జిల్లాలోని రాయగడ, మల్కనగిరి, నవరంగపూర్, కొరాపుట్‌లలో 20 శాఖలు ఉండగా మల్కనగిరి జిల్లా మత్తిలి, బలిమెల కేసీసీ శాఖలు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో నూరు శాతం లక్ష్యాన్ని అధికారులు తెలిపారు. ఈ నెల 30లోగా అన్ని బ్రాంచ్‌లు వంద శాతం లక్ష్యం చేరుకోవాలని చెప్పారు.

కూలిన తరగతి గది పైకప్పు



కూలిన పైకప్పు

భువనేశ్వర్: స్థానిక యూనిట్–9 బాలుర ఉన్నత పాఠశాల సముదాయంలో బుధవారం తరగతి గది పైకప్పు పెచ్చులు ఊడి రాలాయి. అదృష్టవశాతు ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోలేదు. బుధవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో తరగతి గది పైకప్పు నుంచి పెచ్చులు ఊడి నేలకు రాలాయి. ఇటీవల 5టీ చొరవ కింద ఈ పాఠశాలను పునరుద్ధరించారు.

340 కిలోల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలతో ఎక్సైజ్ సిబ్బంది

మల్కన్‌గిరి: ఎక్సైజ్ సిబ్బంది దాడుల్లో 340 కిలోల గంజాయి పట్టుబడింది. మల్కన్‌గిరి జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి బింభధర్ పండా ఆదేశాలతో మంగళవారం రాత్రి ప్రత్యేక బృందం చిత్రకొండ సమితి పెప్పరమేట్ల పంచాయతీ సారుకుబొండ గ్రామ అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా జరుతుందనే ముందస్తు సమాచారంతో ఎక్సైజ్ అధికారి బింబధర్ తన సిబ్బందిని పంపారు. అయితే ఎక్సైజ్ సిబ్బంది రాకను గమనించి గంజాయి మాఫియా బస్తాలతో రవాణాకు సిద్ధంగా ఉంచిన గంజాయి విడిచిపెట్టి అక్కడ నుంచి పరారైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలను ఎక్సైజ్ సిబ్బంది చిత్రకొండ కార్యాలయానికి తరలించారు. బుధవారం తహసీల్దార్ సమక్షంలో చిత్రకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ బళ ఇతర సిబ్బంది కలిసి గంజాయిని తూకం వేయగా 340 కేజీలు ఉన్నట్టు నిర్ధారించారు. దీని విలువ 35 లక్షల రూపాయలు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

ముగిసిన జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరం



ప్రశంసాపత్రం అందుకుంటున్న మహిళ

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి ఎంవీ–7 గ్రామం వద్ద జగన్నాధపల్లి ఉన్నత పాఠశాలలో మూడు రోజులు జరిగిన జిల్లాస్థాయి రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. చివరి రోజున ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి చిత్తరంజన్ పాణిగ్రాహి హాజరై మాట్లాడారు. శిక్షణలో ఇచ్చిన విషయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీటీ కార్తీక్ చంద్ర బెహరా, జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ దేవరాజ్ సేఠీ పాల్గొన్నారు. శిక్షణ పొందిన 61 మందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

భూతల స్వర్గం కొరాపుట్



భారత మాల టన్నెల్‌లో పర్యటిస్తున్న గవర్నర్

- గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు
- దేవమాలి పర్యాటక కేంద్రం సందర్శన



దేవమాలిలో పర్యటిస్తున్న గవర్నర్ హరిబాబు

కొరాపుట్: ప్రకృతి అందాలతో నిండిన కొరాపుట్ జిల్లా భూతల స్వర్గం వంటిదని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అభివర్ణించారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి దేవమాలి అంతర్జాతీయ ప్రాకృతిక పర్యాటక కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. మేఘాలు కొండలను తాకుతూ వెళ్తున్న దృశ్యాలు వీక్షించారు. అనంతరం మొక్క నాటారు. దేవమాలిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.20 వేల కోట్లతో విశాఖపట్నం–రాయ్‌పూర్ మధ్య నిర్మిస్తున్న ఆరు అంచెల ఎకనామిక్ కారిడార్‌ని సందర్శించారు. ఈస్టన్ ఘాట్స్‌ను చీల్చుకుంటూ నిర్మించిన భారీ టన్నెల్‌లో పర్యటించారు. సొరంగం ప్రాముఖ్యతను ఎన్‌హెచ్ అధికారులు గవర్నర్‌కు వివరించారు. సునాబెడలో హిందూస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్ (హాల్)ని సందర్శించి అక్కడ సుఖోయ్ యుద్ధ విమానాల ఇంజిన్ల తయారీ విభాగం పరిశీలించారు. ఉన్నత స్థాయి అధికారులతో చర్చలు జరిపారు. పుంగార్‌లోని ఏకలవ్య మోడల్ విద్యాలయం బాలలతో సంభాషించారు. కేంద్రియ విశ్వ విద్యాలయంలో ఉన్నత స్థాయి అధికారుల నియామకం చాలా కాలంగా జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కొరాపుట్‌లో పలు సంస్థల ప్రతినిధులు ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల అభివృద్ధిపై వినతి పత్రాలు సమర్పించారు. కొన్ని చోట్ల గిరిజనులను పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో కలెక్టర్ సత్యావాన్ మహాజన్, ఎస్పీ రోహిత్ వర్మ తదితరులు న్నారు.



గవర్నర్‌కు టన్నెల్ విశిష్టతను వివరిస్తున్న ఎన్‌హెచ్ అధికారులు



స్థానికుల సమస్యలు వింటూ..



హాల్‌లో సుఖోయ్ యుద్ధ విమానం ఇంజిన్ పరిశీలిస్తున్న దృశ్యం

గజపతి జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

పర్లాకిమిడి: గజపతి జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ దృష్టిసారించింది. ఇందులో భాగంగా గజపతి జిల్లాలో అయిదు రోజులుగా పర్యటిస్తున్న సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి ఎస్. రఘువీరా రెడ్డి పర్లాకిమిడిలోని సాయి ఇంటర్‌నేషనల్ హోటల్‌లో మేధావులతో బుధవారం సాయంత్రం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో ఏడు మండలాల్లో పర్యటించిన తర్వాత జిల్లా అభివృద్ధికి మేధావులు, పారిశ్రామిక వేత్తలు, జర్నలిస్టులు సలహాలు ఇవ్వాల్సిందిగా రఘువీరా రెడ్డి కోరారు. పర్యాటక కేంద్రాల అభివృద్ధి, వ్యవసాయం, వాటి ఉత్పత్తులకు మార్కెటింగ్, పండ్ల సాగుకు అనుకూలమైన గజపతిలో వాటిని ఎగుమతి, శీతల గిడ్డంగులు, ఆదివాసీ విశ్వవిద్యాలయం ఏర్పాటు, రైల్వే లైన్ పొడిగింపు, హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నడపడం ద్వారా ఉపాధి కల్పన కల్పించాలని పలువురు సూచించారు. ప్రతి సమితి కేంద్రంలో పలువురి కలుసుకుని వాటి తుది నివేదిక ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు సమర్పించనున్నానని సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరా రెడ్డి అన్నారు. మేధావుల సమావేశంలో మోహనా ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు దాశరథి గోమాంగో, అప్పాన శ్రీనివాసరావు, పీసీసీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే చిన్మయి బెహారా, మహిళా కాంగ్రెస్ నాయకురాలు నిరుపమ పాత్రో, రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణ ఛత్రపతి పాల్గొన్నారు.



మేధావుల సమావేశంలో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

భువనేశ్వర్ : 17వ రాష్ట్ర శాసన సభ నాలువ సమావేశాలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల, విభాగాల కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా ఆదేశించారు. ఈ మేరకు కార్యదర్శులకు లేఖ జారీ చేశారు. విదేశీ పర్యటనలకు వెళ్లకుండా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సంబంధిత వర్గాలతో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకోవాలని ప్రత్యామ్నాయంగా సూచించారు. సమావేశాల సమయంలో అధికారిక పరిస్థితులకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సంబంధిత సమాచారం, దస్తావేజులు ప్రవేశ పెట్టాల్సి ఉంటుంది. వాయిదా తీర్మానాలు, ప్రశ్నోత్తరాలు వంటి కీలక పరిస్థితుల్ని పర్యవేక్షించే దిశలో కార్యదర్శులు అంతా అందుబాటులో ఉండాలన్నారు.

టాయిలెట్‌లో ప్రసవం

మల్కన్‌గిరి: కలిమెల సమితి ఆరోగ్య కేంద్రంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. నలగ్రంధి గ్రామానికి చెందిన పాడియా కస్ప భార్య సింఘే కస్పకు నెలలు నిండటంతో సోమవారం సాయంత్రం కలిమెల ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు మంగళవారం ప్రసవం జరుగుతుందని చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ లెట్రిన్ ట్యాంక్‌లో చిక్కుకోవడంతో ఓ మహిళ వచ్చి బిడ్డను బయటకు తీసింది. వెంటనే వైద్యులు చికిత్స అందించడంతో తల్లీబిడ్డలు కోలుకున్నారు.



చికిత్స పొందుతున్న సింఘే కస్ప

పోక్సో, నల్సా చట్టాలపై అవగాహన



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవులో

పర్లాకిమిడి: స్థానిక మహేంద్రగిరి పురపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం పోక్సో, నల్సా చట్టం– 2018పై విద్యార్థులకు అవగాహన శిబిరాన్ని జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవుళో, పబ్లిక్ ప్రాసిక్యూటర్ (జిల్లా కోర్టు) రాజేష్ కుమార్ మిశ్రాలు మాట్లాడారు. పోక్సో చట్టం ద్వారా విద్యార్థినులు, మైనర్ బాలికలపై లైంగిక దాడులు జరిగితే కోర్టులు ఎలా ప్రతిస్పందిస్తాయి, వారికి తగిన విధంగా న్యాయం చేకూర్చడమే కాకుండా నల్సా చట్టం కింద పీడిత మైనర్ బాలికలకు నష్ట పరిహారం ఇప్పించడంపై డీఎల్ఎస్ఏ కార్యదర్శి బిమల్ రవుళో వివరించారు. సమావేశంలో సీనియర్ అడ్వకేట్ ఆర్.బాబూరావు, బి.చిట్టిబాబు, బార్ అసోసియేషన్ సభ్యులు డి.అనుప్ కుమార్, ప్రధాన ఉపాధ్యాయులు పూర్ణచంద్ర ప్రధాన్ పాల్గొన్నారు.



లైంగిక వేధింపుల చట్టాలను వివరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్‌కుమార్ మిశ్రా

ఎరువులు ఇవ్వండి మహాప్రభో!



జాతీయ రహదారిపై ఆధార్ కార్డులు పెట్టిన రైతులు

- ఆధార్ కార్డులతో బారులు తీరిన రైతులు
- 300 బస్తాల ఎరువులకు 800 మంది రైతులు

భువనేశ్వర్: ఎరువుల కొరతతో రాష్ట్ర రైతాంగం తల్లడిల్లుతోంది. అందుబాటులో ఉన్న అరకొర ఎరువుల కోసం అన్నదాతలు బారులు తీరుతున్నారు. పశ్చిమ ఒడిశా బొలంగీర్ జిల్లా దేవగడ్ ప్రాంతంలో రైతులు బుధవారం యూరియా అందజేయాలని కోరుతూ జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన చేపట్టారు. రోడ్డు పొడవునా ఆధార్ కార్డులు పేర్చి పంచాయతీ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో బారులు తీరారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి వరుసలో గుమిగూడారు. బుధవారం ఉదయం బొలంగీర్ జిల్లా దేవగడ్ మండలం గొడొగొతొ వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రుణం తీసుకున్న రైతులకు ముందుగా యూరియా ఎరువులు అందించాలని నిబంధన విధించినందున, రుణం తీసుకోని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా, రైతుల అవసరానికి అనుగుణంగా ఎరువులు అందుబాటులో లేవని అనుబంధ అధికార వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ప్రసవ వేదన

రాయగడ : గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అంబులెన్స్ చేరుకోలేకపోయింది. దీంతో నిండు గర్భిణి ఆస్పత్రిని నడిపించుకుని తీసుకువెళుతుండగా మార్గమధ్యలోనే పాపకు జన్మనిచ్చింది. ఈ ఘటన కళ్యాణసింగుపూర్ సమితి చంచడా గ్రామంలో బుధవారం నాడు చోటు చేసుకుంది. చంచడా గ్రామానికి చెందిన సునీల్ ప్రస్కా భార్య వనితా ప్రస్కా నిండు గర్భిణి. బుధవారం పురిటి నొప్పులు రావడంతో ఆశా కార్యకర్త అంబులెన్స్‌కు సమాచారం అందించింది. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో కొద్ది దూరంలో అంబులెన్స్ నిలిచిపోయింది. కుటుంబ సభ్యులు వనితాను నడిపించుకుని తీసుకొస్తుండగా మార్గమధ్యలో శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



నడుచుకుంటూ వస్తున్న గర్భిణితో ఆశా కార్యకర్త, బంధువులు

రైతు సమస్యలపై వినతి

పర్లాకిమిడి:

గజపతి జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై జిల్లా అదనపు మాజిస్ట్రేట్ ఫల్గుని మఝికి బుధవారం నవనిర్మాణ్ కృషక్ సంఘటన్ రాష్ట్ర కోఆర్డినేటరు శేష దేవ్ నోందో, రంజిత్ పట్నాయక్ బుధవారం వినతిపత్రం అందజేశారు. నవనిర్మాణ్ కృషక్ సంఘటన్ సభ్యులు ప్రభాత్ మహాలిక, దండాసి ఖండువాల్, రంజిత్ పట్నాయక్‌లు సబ్ కలెక్టర్‌తో భేటీ అయ్యారు. జిల్లాలో యూరియా కొరత, నల్లబజారుకు తరలింపు, పత్తి పంటకు మండీల ఏర్పాటు, అన్ని సమితి కేంద్రాల్లో శీతల బండారాలు నిర్మాణం, పంట పొలాలకు సాగునీరు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ వంటి పలు సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు, ప్రభుత్వం ప్రతిస్పందించకుంటే గజపతి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు.



ఏడీఎం మఝికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నవ నిర్మాణ్ కృషక్ సంఘటన్ సభ్యులు

నెక్కంటి.. వెళ్లిపోతే ఏంటి?

- ఆయన రాజీనామాతో పార్టీకి ఒరిగిందేమీ లేదు
- పార్టీకి వెన్నుపోటు పొడిచి ద్రోహానికి పాల్పడ్డారు
- మాజీ మంత్రి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగన్నాథ సరక



మాట్లాడుతున్న బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగన్నాథ సరక. వేదికపై దాస్, గొమాంగొ తదితరులు



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

రాయగడ: రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావుతో పాటు అతని మద్దతుదారులు బీజేడీ పార్టీకి రాజీనామాలు చేసినంత మాత్రాన ఒరిగిందేమీ లేదని రాష్ట్ర మాజీ మంత్రి, బిజూ జనతా దళ్ జిల్లా అధ్యక్షుడు జగన్నాథ సరక స్పష్టం చేశారు. స్థానిక కైలాస్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 ఏళ్ల బీజేడీ హయాంలో నెక్కంటి ఎన్నో పదవులను అధిరోహించి ఉన్నత స్థాయికి వెళ్లిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. అయితే ఇప్పుడు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వకపోవడంతో పార్టీకి రాజీనామా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నమ్మక ద్రోహం చేసింది నెక్కంటే గానీ బీజేడీలో ఉన్న అదృశ్య శక్తి ఏమాత్రం కాదన్నారు. మొసలి కన్నీరు కార్చి పార్టీపై నిందలు మోపినంత మాత్రాన ఎవ్వరూ నమ్మరని చెప్పారు. ఆదివాసీ హరిజన జిల్లాగా గుర్తింపు పొందిన రాయగడలో జిల్లా అధ్యక్ష పదవిని ఈసారి తనకు దక్కడం నెక్కంటి జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఒక ఆదివాసీ నాయకుడికి పదవి వచ్చిందని సంతోషించాల్సింది పోయి పార్టీపై దుమ్మెత్తి పోయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ఆయన పార్టీలో లేకపోవడం ఎంతో శుభపరిణామమని అన్నారు. నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమవుతున్నానని చెప్పుకుంటున్న నెక్కంటి పార్టీకి వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు.

మరింత శక్తివంతంగా పార్టీ..

బీజేడీ త్వరలో మరింత శక్తివంతమైన పార్టీగా ఆవిర్భవించి తిరిగి పూర్వవైభవం తీసుకువచ్చేలా తాను శాయశక్తులా కృషి చేస్తానని సరక తెలిపారు. కలుషిత , కుతంత్ర రాజకీయాలకు తావులేకుండా నిరంతరం పార్టీ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ప్రజల్లో ఉన్న ఆదరాభిమానాలే పార్టీ విజయానికి సోపానాలుగా మారాయని, అంతేతప్ప నెక్కంటి వల్ల పార్టీకి గత ఐదేళ్లలో కీడే జరిగింది తప్పా ఏమాత్రం మంచి జరగలేదన డానికి గత సాధారణ ఎన్నికలే నిదర్శనమన్నారు. జిల్లా అధ్యక్షుడి హోదాలో నెక్కంటి జిల్లాలోని మూడు శాసన సభ నియోజకవర్గాలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానాన్ని గెలిపించలేకపాయారని, అందుకు ఆయన స్వయంకృత అపరాధంతో పాటు కుటిల రాజకీయాలే ప్రధాన కారణమని దుయ్యబట్టారు. 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో పార్టీ పరంగా అనేక ప్రయోజనాలు పొంది లాభపడ్డారే తప్పా అతను నష్టపోయిందేమీ లేదని విమర్శించారు.

వెన్నుపోటు రాజకీయాలు తగవు..

స్వచ్ఛమైన రాజకీయాలతో మాత్రమే పార్టీ మనుగడ కొనసాగుతుంది తప్ప కుటిల రాజకీయాలతో ఏమాత్రం ముందుకు సాగలేదని పార్టీ సీనియర్ నాయకుడు, బీజేడీ జిల్లా మాజీ అధ్యక్షుడు సుధీర్ దాస్ అన్నారు. పార్టీలో లాభపడిన భాస్కరరావు రాజీనామా డ్రామా చేయడం పార్టీకి వెన్నుపోటు లాంటిదన్నారు. అతని రాజీనామతో కార్యకర్తల్లో కొత్త ఆనందం వెలుగు చూస్తోందన్నారు. పార్టీకి రాజీనామ చేసిన అతని బిజు స్వాభిమాన్ మంచ్ అనే సామాజిక వేదికగా కార్యకలాపాలు కొనసాగిస్తామని బహిరంగంగా ప్రకటించారని, నవీన్ తండ్రి బిజూ పేరును ఎందుకు వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. బిజూ పేరుతొ మళ్లీ రాజకీయాల్లో చెలామణి అయ్యేందుకు చేస్తున్న ఈ ప్రయత్నం సఫలీకృతమవ్వదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రాయగడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్రా పండా, జిల్లా పరిషత్ మాజీ సభ్యుడు, సీనియర్ నాయకుడు పట్నాన గౌరీ శంకరరావు, గుణుపూర్ మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్ఏయూ రిజిస్ట్రార్‌గా అడ్డయ్య



అడ్డయ్యకు నియామకపత్రాన్ని అందిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా వర్సిటీ సీనియర్ అధ్యాపకుడు ఆచార్య బి.అడ్డయ్య నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ఆచార్య కె.ఆర్.రజని నియామక ఉత్తర్వులు బుధవారం అందజేశారు. ఇప్పటివరకు అడ్డయ్య వర్సిటీ రెక్టార్‌గా వ్యవహరించడమే కాకుండా, పలు మార్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా సేవలను అందించారు.

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు



ఇంటిని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నరసన్నపేట: స్థానిక మెయిన్ రోడ్డులోని వేంకటేశ్వర థియేటర్ సమీపంలో ఉన్నటువంటి ఎం.పాపారావు ఇంట్లో పెను ప్రమాదం తప్పింది. ఉదయం పాపారావు భార్య కుమారి పాలు మరిగిస్తుండగా ఒక్కసారిగా సిలిండర్ నుంచి మంటలు వ్యాపించాయి. కొన్ని సెకన్లలోనే మంటలు ఎగసిపడ్డాయి. దీంతో కుమారి భయంతో బయటకు పరుగులు తీసింది. వెంటనే స్థానికులు వచ్చి తడి గోనె సంచులు కప్పి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న స్థానిక అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి, పరిశీలించి తగు సూచనలు చేశారు. కాగా ఈ ప్రమాదంలో ఎటువంటి నష్టం జరగలేదు.

28 పశువులు పట్టివేత

రణస్థలం: లావేరు మండలంలోని ఎన్‌హెచ్–16పై సుభద్రాపురం జంక్షన్‌లో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వెళ్తున్న రెండు ఐసర్ వ్యాన్‌లలో తరలిస్తున్న 28 పశువులను(గేదెలను) లావేరు పోలీసులు పట్టుకున్నారు. దీనిపై లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తూరు : నివగాం గ్రామానికి చెందిన బి.కమలహాసన్, బి.రాజేష్‌లు వెలుగు కార్యాలయంలోకి వచ్చి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అనుమతి లేకుండా వీడియోలు చిత్రీకరించారని ఏపీఎం లలిత పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ బుధవారం తెలిపారు.

బోండా గిరిజనుల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు



బోండా గిరిజన మహిళలు, అధికారులతో రాష్ట్ర గవర్నర్ హరిబాబు



సీతకొండ వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గవర్నర్



మహిళకు చెక్ అందజేస్తున్న గవర్నర్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి బోండా ఘాటీలో బుధవారం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు తొలిసారి పర్యటించారు. ఆదిమ బోండా గిరిజనుల పురోభివృద్ధిపై ప్రసంగించారు. ముందుగా కోరాపుట్ నుంచి మల్కన్‌గిరి జిల్లా గోవిందపల్లి వరకు వచ్చి అక్కడి నుంచి బోండాఘాటీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయ నృత్యంతో స్వాగతం పలికారు. బోండాఘాటీ పవిత్ర సీతకుండ శ్రీరామాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం బోండా డెవలప్‌మెంట్ ఏజెన్సీని సందర్శించారు. బోండా నైపుణ్యాభివృద్ధి కేంద్రం, టైలరింగ్ యూనిట్, మల్టీప్రాసెసింగ్ యూనిట్, బోండా సంప్రదాయ వస్త్రాలు, ఆభరణాల తయారీ పరిశీలించారు. స్వయం సహాయక గ్రూపుల మహిళలు, ఆదిమ బోండా గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 15 మంది గిరిజనులకు భూపట్టాలు అందజేశారు. పలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో, ఎస్పీ వినోద్ పటేల్, డీఎఫ్ఓ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ వేడుకలకు సన్నాహాలు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఎన్‌సీసీ క్యాడెట్‌లు



కార్యక్రమంలో పాల్గొన్న కులపతి మహేశ్వర నాయక్, తదితరులు



సెలక్షన్ శిబిరంలో పాల్గొన్న అధికారులు

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో 2026 జనవరి 26న జరుగనున్న రిపబ్లిక్ దినోత్సవాల్లో పాల్గొనేందుకు ప్రీ రిపబ్లిక్ డే సెలక్షన్ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ బ్యూరో నిర్వహించిన ఈ శిబిరంలో కొరాపుట్, మల్కనగిరి, రాయగడ, నవరంగపూర్ జిల్లల్లోని 43 కళాశాల నుంచి 53 ఎన్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్.ఎస్.ఎస్ బ్యూరో కోఆర్డినేటర్ డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ నేతృత్వంలో నిర్వహించిన శిబిరంలో ముఖ్యఅతిథిగా జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ కులపతి మహేశ్వర్ నాయిక్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. గతేడాది విశ్వవిద్యాలయ బ్యూరో కొరాపుట్ డీఏవీ ప్రభుత్వ కళాశాల జాతీయ సేవా యోజన అధికారి, గతేడాది ఢిల్లీ రిపబ్లిక్ డే ఉత్సవాలలో పాల్గొన్న మనోజ్ బెహరను ఎన్.ఎస్.ఎస్ బ్యూరో ఘనంగా సన్మానించింది. శిబిరంలో పాల్గొన్నవారు శారీరక విన్యాసాలు, పరుగు పందాలు, కవాతు తోపాటు జ్ఞాన పరీక్షలు, నృత్య గీతాలు, నాట్య కార్యక్రమాలు నిర్వహించారు. కొరాపుట్ జిల్లా కిశోర్ చంద్ర బెహరా, కెప్టెన్ లక్ష్మణ పాత్రో, కొరాపుట్, నవరంగపూర్ జిల్లాల కార్యక్రమ అధికారులు సుసాంత కుమార్‌బెహరా, బినోద్ బిహారి ప్రధాన్, కుడుములగుమ్మ కళాశాల, కార్యక్రమ అధికారి విష్ణుజిత్ మహంతి, బొరిగుమ్మ కార్యక్రమ అధికారి జి.ఉమా మహేశ్వరి, మల్కనగిరి డిగ్రీ కళాశాల కార్యక్రమ అధికారి దీప్తి మిశ్ర, విక్రమదేవ్ విశ్వవిద్యాలయ కార్యక్రమ అధికారి లోకేష్ అధికారి, సుకాంతి, గుణుపూర్ కార్యక్రమ అధికారి ఘణిష్టి పుష్టి, నవరంగపూర్ మోడల్ కళాశాల పీఓ రంజులత కహార్, ప్రకాశ్ విద్యాలయ జయపురం ఎన్.సి.సి అధికారి రాజేంద్ర కుమార్ సాహు, సుజాత బేజ్ తదితరులు పాల్గొన్నారు. ఈశిబిరంలో సెలెక్ట్ అయినవారు పూరీలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎంపిక శిబిరంలో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు.

12 నుంచి పశ్చిమబెంగాల్‌లో సామవేదం షణ్ముఖ శర్మ పర్యటన

భువనేశ్వర్: పశ్చిమబెంగాల్‌లో ఉంటున్న ప్రవాసాంధ్రుల ఆహ్వానం మేరకు సనాతన ధర్మ పరిశోధకులు సామవేదం షణ్ముఖ శర్మ పర్యటించనున్నారు. ఈ పర్యటన ఖరగ్‌పూర్ నుంచి ప్రారంభం అవుతుంది. ఖరగ్‌పూర్ పాతకోళీ వైకుంఠ ముఖద్వార వేంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యవర్గం ఆధ్వర్యంలో ఖరగ్‌పూర్ తెలుగు ప్రజానీకం భారీ ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు వైకుంఠ ముఖద్వార వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో పలు ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా షణ్ముఖ శర్మ ప్రవచనం, వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సం, గోమాత విశిష్టత వంటి ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి షణ్ముఖ శర్మ సమక్షంలో ఖరగ్‌పూర్ తెలుగు ప్రజలు సామూహికంగా లలితాదేవి స్తోత్ర అఖండ పారాయణం నిర్వహిస్తారు. ఈ పర్యటనలో భాగంగా ఖరగ్‌పూర్ ఐఐటీ సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం కోల్‌కత్తా తెలుగు సంఘం ఆహ్వానం మేరకు కోల్‌కత్తాలో పర్యటించనున్నారు.

గొర్రెల కాపరిని ఆదుకోవాలి

రణస్థలం: మండలంలోని జేఆర్‌పురం పంచాయతీ సీతంవలసకు చెందిన గొర్రెల కాపరి పిట్ట రమణకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకుడు కోనంగి నందుడు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు మద్దాడ రాజశేఖర్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, పశు సంవర్ధక శాఖ జేడీ కె.రాజగోపాల్‌రావు, ఏడీఏ బి.దుర్గారావులకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు.

రామాయణంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



పోటీలకు హాజరైన పిల్లలు

జయపురం: జయపురం అసోసియేట్ ఎడ్యుకేషన్, ఎన్విరోన్‌మెంటల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ (సీవా)స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామాయణపై విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక సిటీ హైస్కూల్ సభాగృహంలో నిర్వహించిన పోటీలలో పట్టణంలోని 18 పాఠశాలల నుంచి 157 మంది పిల్లలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు, కవి, కథకులు, నళినీ రంజన్ మిశ్ర కార్యక్రమ ప్రధాన లక్ష్యాన్ని వివరించారు. విద్యార్థులు ఆధ్యాత్మకంగా ఎదగాలన్నదే కార్యక్రమం లక్ష్యం అన్నారు. అందుకు రామాయణ, భారత, పురాణ గాథలపై అవగాహన కల్గించటం, ఉత్తమ మనుషులుగా మార్చటం, పెద్దలను గౌరవించటం, చిన్నవారిని ప్రేమించే వాతావరణం కల్పించాలన్నారు. పోటీల నిర్వహకులను అభినందించారు. కార్యక్రమంలో నటుడు, గాయకుడు, భాగవత శిక్షకులు, ఆధ్యాత్మక పాఠశాల ప్రధాన ప్రబంధకులు అరవింద మహాపాత్రో, సోనాలి పతి, సిటీ హైస్కూల్ కమిటీ సభ్యులు శశి పట్నాయక్, సీవా సంస్థ అధ్యక్షులు సుధాకర పట్నాయక్, ప్రతాప్ కుమార్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో సీనియర్ గ్రూపులో అభిపాస పట్నాయక్, సహిళ పట్నాయక్, సుజిత్ సాహులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. జూనియర్ గ్రూపులో స్వస్తిక ప్రసాద్ సాహు, సచిత్ కుమార్ గంతాయిత్, సుమిత్ర మొదటి మూడుస్థానాల్లో నిలవగా.. అనన్య త్రిపాఠీ చతుర్థ, బి.భవ్య లక్ష్మి పంచమ స్థానంలో నిలిచారు. విజేతలకు అతిథులు బహుమతులతో సత్కరించారు. కార్యక్రమాన్ని సీవా ప్రతినిధి జి.వెంకట రెడ్డి, సౌమ్యరంజన్ దొలాయి, లిపిక పాత్రో, అజయ మిశ్ర, గోపాల సాహు, నళినీ పాత్రో, రంజిత్ నాయిక్, సుమన్ ముంద్ర, ఆనంద ముంధ్ర ప్రదీప్త సాహు నిర్వహించారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలి



ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షిస్తున్న జిల్లా నోడల్ కార్యదర్శి తిరుమల నాయక్

- ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా నోడల్ కార్యదర్శి తిరుమల నాయక్ సమీక్ష

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గ్రామీణ భవనాలు, తాగునీటి పథకాలు, విద్య, వైద్య, అంగన్‌వాడీ భవనాలు, గోపబంధు జన ఆరోగ్య యోజన పథకాల పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని జిల్లా నోడల్ కార్యదర్శి, బీడీఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.తిరుమలనాయక్ అన్నారు. గజపతి జిల్లాలో రెండు రోజులపాటు గుమ్మా, కాశీనగర్, ఆర్.ఉదయగిరి, నువాగడ, మోహనా సమితుల్లో పర్యటించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 3,79,071 మంది గోపబంధు జన ఆరోగ్య యోజనా పథకం కింద దరఖాస్తు చేసుకోగా, కేవలం 2,23,238 మందికి మాత్రమే ఆరోగ్య కార్డులు అందజేశారు. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియజేయాలని జిల్లా ముఖ్య వైద్యాధికారి, డీహెచ్‌ఓ డాక్టర్ ఎం.ఎం.ఆలీని ప్రశ్నించారు. కాశీనగర్ బ్లాక్‌లో అల్లగ గ్రామంలో ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరచాలని, ఖండవ వద్ద నిర్మించిన మెగా తాగునీటి పథకాన్ని ప్రభుత్వం ఆమోదించిన సమయానికి పూర్తిచేయాలన్నారు. జిల్లాలో అంత్యోదయ గృహాలు నిర్మాణం, పర్లాకిమిడి పట్టణంలో శంకర్‌బాస్ చెరువు పునరుద్ధరణ పనులు, రోడ్లు, ఆహార కేంద్రాల నిర్వహణ మెరుగుపరచాలని పురపాలక ఈఓ లక్ష్మణ ముర్మును ఆదేశించారు. ముఖ్యంగా జిల్లా హెడ్‌క్వార్టర్ ఆస్పత్రిలో డాక్టర్ల కొరత వెంటాడుతుందని దీనిని సకాలంలో నియామకాలు చేపట్టాలని డా.ఎస్.తిరుమల నాయక్ అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మధు మిత, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, డీఎఫ్ఓ కె.నాగరాజు, ఆదనపు సీడీఓ ఫృథ్వీరాజ్ మండళ్, ఏడీఎం ఫల్గుణీ మఝి, తదితరులు పాల్గొన్నారు.

వెల్డింగ్ శిక్షణ.. భవితకు నిచ్చెన..!



వెల్డింగ్ చేసిన తర్వాత గ్రైండింగ్‌లో శిక్షణ పొందుతున్న యువకుడు

- వెల్డింగ్‌తో ఉపాధికి విస్తృత అవకాశాలు
- జిల్లాలో 250 వరకు శిక్షణ సంస్థలు
- విదేశాల్లో మంచి జీతాలు
- మోసపోవద్దని పోలీసుల సూచన

వజ్రపుకొత్తూరు: నేటి యువత అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ కొలువులే కాకుండా వెల్డింగ్ రంగంపై కూడా ఆసక్తి పెంచుకుంటున్నారు. సాంప్రదాయ వెల్డింగ్‌తో పాటు హైటెక్ ఆటోమేటెడ్ పరికరాలను ఉపయోగించే పరిశ్రమలకు ఉపయోగపడే ప్రొఫెషనల్ వెల్డింగ్‌లోనూ నైపుణ్యం సాధిస్తున్నారు. వెల్డింగ్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సొంతంగా వెల్డింగ్ ఇనిస్టిట్యూట్, ఫ్యాబ్రికేషన్లను ప్రారంభించి మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. మరికొంతమంది విదేశాల బాట పడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులతో సమానంగా నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు సంపాదిస్తున్నారు.

ఉత్తమ ఉపాధి అవకాశాలు

చేతిలో పని(స్కిల్) ఉంటే ఎలాంటి సంస్థలైనా ఉపాధి కల్పిస్తాయని తెలుసుకుని ఇప్పుడు శిక్షణ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ప్రతిభ ఉన్నవారికి ఉపాధి అవకాశాలు తలుపు తడుతున్నాయి. వెల్డింగ్, ఫిట్టర్, సేఫ్టీ రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఈ రంగాల్లో జీతం నెలకు రూ.3.50 లక్షల వరకు సంపాదించే యువత కూడా ఉద్దానం ప్రాంతంలో ఉన్నారు. రష్యా, ఇటలీ, జపాన్, పోలెండ్ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. దీంతో యువకులు ఈ కోర్సులపై మొగ్గు చూపుతున్నారు. రేపటి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయడానికి శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, కంచిలి, హరిపురం, పలాస, పూండి, నరసన్నపేట, శ్రీకాకుళం, రూరల్, అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 250కి పైగా వెల్డింగ్ ఇనిస్టిట్యూట్లు నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నాయి. స్కిల్ ఉన్నవారిని పిలిచి మరీ ఉద్యోగాలు ఇస్తారని తెలుసుకుని యువకులు పోటీతత్వంతో ముందుకు సాగుతున్నారు. వీరికి వెల్డింగ్ రంగం గొడుగు పడుతోంది.



వెల్డింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న యువకుడు



వెల్డింగ్ నేర్చుకుంటున్న యువకుడు

మోసపోతున్న యువత

కాగా విదేశీ ఉద్యోగాల మోజులో యువత కొంతమంది ఏజెంట్లు, మధ్యవర్తులను నమ్మి మోసపోతున్నారు. లక్షలాది రూపాయలను వారి చేతిలో పెట్టి టూరిస్టు వీసాలతో వెళ్లి అక్కడ నరకయాతన అనుభవిస్తున్నారు. గుర్తింపు పొందిన వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్లలో నమోదైన సంస్థల్లో మాత్రమే శిక్షణ తీసుకోవాలని పోలీసులు చెబుతున్నా యువత పెడచెవిన పెట్టి ఉద్దానం, తీర ప్రాంత గ్రామాల్లోని విదేశీ ఏజెంట్ల వలలో చిక్కిపోతున్నారు. నకిలీ వీసాలతో పాటు కంపెనీ కాంట్రాక్టు కాపీలు, జీతం, వసతి అలవెన్సులు తదితర విషయాల్లో సైతం మోసాలకు పాల్పడుతుండడంతో విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోయిన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

సర్టిఫైడ్ కోర్సులకు డిమాండ్

ఉన్నత విద్యను అభ్యసించినవారు సైతం ఉపాధి కోసం సాంకేతిక విద్యను ఎంచుకుంటున్నారు. అందులో భాగంగా వెల్డింగ్, గ్యాస్ కటింగ్‌లపై శ్రద్ధ చూపిస్తున్నారు. వెల్డింగ్‌లో సెర్టిఫైడ్ కోర్సులను అభ్యసించి ఇండియాలో స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రాజెక్టుల్లో పాటు విదేశాల్లో సైతం ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. అలాంటి వారిని ప్రోత్సహించడంలో విశాఖ, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పూండి ప్రాంతాల్లోని వెల్డింగ్ శిక్షణ కేంద్రాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. ఆరు నెలలు, ఏడాది పాటు శిక్షణ పొందితే చాలు ఏ సంస్థ అయినా వెల్డర్‌గా పనిలోకి తీసుకుంటుంది. ఇది నిరుద్యోగులకు వరంగా నిలుస్తోంది.

విదేశాల్లో ఉద్యోగాలు

ఉద్యోగం సాంపాదించడం కోసం వెల్డింగ్ నేర్చుకుని సింగపూర్, దుబాయ్, అబుదాబి, అమెరికా, ఆస్ట్రేలియా, పోలెండ్, రష్యా, అజర్‌బైజాన్, కత్తర్, థాయ్‌లాండ్, బ్యాంకాక్, మలేషియా వెళ్లిన యువకులు జిల్లాలో అనేక మంది ఉన్నారు. అధికంగా యువకులు విదేశాలకు వెళ్లడానికి ఆసక్తి కనబరుస్తుండడంతో వారి అవసరాలకు అనుగుణంగా వెల్డింగ్ శిక్షణ సంస్థలు వివిధ కోర్సులను అందిస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో దాదాపు 250 వరకు శిక్షణ సంస్థలు 3జీ, 4జీ, 6జీ, టిగ్, ఆర్క్, మిగ్ వెల్డింగ్‌లో శిక్షణ అందిస్తున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు ఇంటర్, ఐటీఐ చేసిన వారిలో ఎక్కువ మంది వెల్డింగ్, ఫిట్టర్, సేఫ్టీ, క్యూసీ రంగంలో ఆసక్తి కనబరుచుకుని ప్రగతికి బాటలు వేసుకుంటున్నారు. ఆటోక్యాడ్ ఇతర సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పొందినవారితో పాటు ఉన్నత విద్యను అభ్యసించినవారు సైతం, టెక్నికల్ ఎడ్యుకేషన్ వైపు వెళ్తుండడంతో వెల్డింగ్‌కు విశేష ఆదరణ లభిస్తోందని శిక్షణ సంస్థల నిర్వహకులు చెబుతున్నారు.

నైపుణ్యతకు ప్రాధాన్యం



మా శిక్షణ సంస్థలో నైపుణ్యతకు ప్రాధాన్యత ఇస్తాం. విదేశాలకు వెళ్లేందుకు యువతకు సూచనలతో పాటు అక్కడ చట్టాలు, తదితర అంశాలను వివరిస్తాం. స్వయంగా అభ్యర్థులు విశాఖ, ఇచ్ఛాపురం, హైదరాబాద్ ప్రాంతాల్లో ఇంటర్వ్యూలకు హాజరై విదేశాలకు వెళ్లి వస్తున్నారు. నేను పదేళ్లు విదేశాల్లో పనిచేశాను. టిగ్, ఆర్క్, గ్యాస్ కటింగ్‌లో అనుభవం ఉంది. మా ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో శిక్ష సంస్థ ఏర్పాటు చేశాం. రిజిస్ట్రేషన్ ఉన్న శిక్షణ సంస్థల్లో మాత్రమే శిక్షణ తీసుకోవాలి. మోసాలు బారిన పడకుండా చూసుకోవాలి. సబ్ ఏజెంట్లు, మోసగాళ్లను నమ్మి మోసపోకుండా చూసుకోవాలి.

– కర్ని భీమారావు, దుర్గా గణపతి వెల్డింగ్ ఇనిస్టిట్యూట్, పూండి

దేశీయంగా ప్రాధాన్యత



నేను సింగపూర్, మలేషియా, దుబాయ్, బ్యాంకాక్ తదితర దేశాల్లో ఉద్యోగం చేసి వచ్చాను. సొంతంగా శిక్షణ సంస్థ పెటుకున్నాను. దేశీయంగా వివిధ ప్రాజెక్టులు, కంపెనీల్లో నైపుణ్యత కలిగిన యువత కావాలని చాలా సంస్థలు ఎదురు చూస్తున్నాయి. ప్రధానంగా మూలపేట పోర్టు, స్టీల్ ప్లాంట్, ఎన్ఎండీసీ, తదితర కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు యువత ఆసక్తి కనబరుస్తున్నారు. వెల్డింగ్‌లో 3జీ, 4జీ, 6జీ, టిగ్, ఆర్క్ వెల్డింగుల్లో శిక్షణ ఇచ్చి సొంతంగా ఉపాధి అవకాశాలు కలిగేలా సూచనలు చేస్తున్నాం. సాంకేతిక విద్యలో స్కిల్ ఉంటే ఎక్కడైనా మంచి పొజిషన్ లభిస్తుంది.

– జి.వైరెడ్డి, శిక్షణ సంస్థ యజమాని, దేవునల్తాడ

5 గంటలు శ్రమించి.. పొట్టలో దిగిన బాణం తొలగింపు



కడుపులో బాణంతో బాధితుడు



శస్త్ర చికిత్సలో వైద్య బృందం

- కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో శ్రస్తచికిత్స



పొట్టనుంచి బయటకు తీసిన బాణం

కొరాపుట్: పొట్టలో దిగిన బాణాన్ని వైద్యులు తొలగించారు. మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి పాకనాగుడ గ్రామ పంచాయతీ నాయక్‌గుడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గౌడ అటవీ ప్రాంతం నుంచి ఇంటికి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో అతని తమ్ముడు విశ్వనాథ్ గౌడ తమ సంప్రదాయ విల్లుతో ఆ ప్రాంతంలో సంచరిస్తున్నాడు. సరదాగా విల్లు నుంచి బాణం విడిచిపెట్టాడు. అది నేరుగా లక్ష్మణ్ గౌడ పొట్టలో దిగింది. వెంటనే స్థానికులు బాధితుడిని మత్తిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి వైద్యుల సూచనతో బాధితుడిని కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ అభిషేక్ పాత్ర, సర్జరీ విభాగాధిపతి మియొంజయ్ మల్లిక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోపాల్ నాయక్ బృందం సుమారు 5 గంటల పాటు చేసిన శాస్త్ర చికిత్సతో బాణం పొట్టనుంచి బయటకు తీశారు. బాణం 8 అంగులాలు పొట్టలో చొచ్చుకుపోయింది. అనేక చోట్ల పేగులు కత్తిరించబడ్డాయి. శరీరం నుంచి ఒకటిన్నర లీటర్ రక్తం బయటకుపోయింది. వైద్యుల కృషితో శస్త్ర చికిత్స విజయవంతం అయింది. డాక్టర్ల బృందానికి బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

కలెక్టరేట్ వద్ద డ్రైవర్ల ధర్నా నేడు

రణస్థలం: ఉచిత బస్సు పథకం వలన ఉపాధి కోల్పోతున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.30 వేలు చెల్లించాలని కోరుతూ, గురువారం శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు రణస్థలం, కోష్ట, పైడిభీమవరంలో ఆటో డ్రైవర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ధర్నా కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐలతో కూడిన సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

క్లుప్తంగా

అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌గా రామ్‌నరేష్


బాధ్యతలు స్వీకరించిన రామ్‌నరేష్‌ను అభినందిస్తున్న సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: విజయనగరం జిల్లా అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌గా బి.రామ్‌నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు ఉద్యోగవిరమణ పొందడంతో ఆయన స్థానంలో విధుల్లో చేరారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో అటవీశాఖ డీఎఫ్‌ఓ, సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీశాఖకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, నాణ్యమైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

విజయనగరం లీగల్: జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయలోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీఅయ్యేలా చూడాలని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎం.బబిత అన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న న్యాయమూర్తులతో బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాజీ పడదగిన క్రిమినల్, మోటారు ప్రమాద బీమా, బ్యాంకు, చెక్కుబౌన్స్, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఎగ్జిక్యూషన్ పిటిషన్, ఎలక్ట్రిసిటీ, ఎక్సైజ్, భూ సంబంధిత కేసులు, కుటుంబ తగాదాలు, మున్సిపాలిటీ, ప్రి లిటిగేషన్ కేసులను ఇరువర్గాల అనుమతితో రాజీమార్గంలో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మీనాదేవి, ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.పద్మావతి, పోక్సో కోర్టు జడ్జి కె.నాగమణి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య, ఎ.కృష్ణప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ఉన్న న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఐస్‌బండితో చెట్టును ఢీకొని వ్యక్తి మృతి


రాము మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఐస్‌బండితో చెట్టును ఢీకొట్టి బుధవారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..విజయనగరంలోని వీటీ అగ్రహారానికి చెందిన సిమ్మ రాము(50) ఐస్ బండి నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. వ్యాపారం నిమిత్తం సుంకరిపేట వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనాన్ని చూసి పక్కకు తప్పించబోయి చెట్టును ఐస్ బండితో చెట్టునుకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కొడుకు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అశోక్ చెప్పారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

విజయనగరం: సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పట్టణానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుధా కుమారి పేర్కొన్నారు. పట్టణంలోని ఓ హోటల్లో బుధవారం రోటరీ సెంట్రల్ క్లబ్ వారు బాలలకు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా సాధించాలనే తపన బాల్యం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. రోటరీ ప్రతినిధులు ప్రతీ ఏడాది సెప్టెంబర్ నెలలో విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని చదువుతో పాటు, కళా రంగాలలో నిష్ణాతులు కావాలంటూ చేస్తున్న కృషిని అభినందించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 156 విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు విజయకుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్ కుమార్, కార్యక్రమం చైర్మన్ దినేష్, ప్రతినిధులు శశి కుక్రేజ, యూత్, సర్వీస్ డైరెక్టర్ రోహిత్ సంజయ్, కృష్ణతేజ, చెన్నాప్రదీప్, ఆర్.శంకర్‌రెడ్డి, అశోక్, జయకృష్ణ, టి.ఎల్. ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పత్రికాస్వేచ్ఛలేని ప్రజాస్వామ్యం ఊహించలేం



ప్రజాస్వామ్య దేశంలో పత్రిక హక్కులు, స్వేచ్ఛ తప్పనిసరి. అలాలేని ప్రజాస్వామ్య దేశాన్ని ఊహించలేం. నిరంకుశ పాలనకు పరాకాష్టగా మారుతుంది. ప్రజలకు తెలియకుండా పాలన ఇష్టారాజ్యంగా సాగుతుంది. రాష్ట్రంలో అధిక సర్క్యులేషన్ ఉన్న పత్రికల్లో ఒకటిగా ప్రజలకు సమాచారాన్ని అందిస్తూ సేవలు అందిస్తున్న సాక్షి దినపత్రికపై కక్ష సాధించడం దురదృష్టకరం. ఇలాంటి పరిస్థితులు రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారుతాయి.

– డి.శ్యామ్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి



పత్రికలపై కక్షసాధింపు హక్కుల హననమే...



దినపత్రిక సంపాదకునిపై అక్రమ కేసులు పెట్టడం అంటే రాజ్యాంగ హక్కులను హననం చేయడమే. పత్రికలో వచ్చిన వార్త విషయంలో పోలీసులు ఏకంగా ఎడిటర్‌పై పోలీసు కేసు నమోదు చేయడాన్ని ప్రజాసామ్యవాదులెవరైనా ఖండించాల్సిందే. ప్రజాప్రతినిధి ఆరోపణల వ్యాఖ్యలను ప్రచురించిన విషయంలో అభ్యంతరాలుంటే అదే పత్రికా ముఖంగా ఖండించాలేగానీ పోలీసు కేసులు పెట్టడం సమంజసం కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా మీడియా స్వేచ్ఛను హరించడం సరికాదు.

– జేపీవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

ఇంజినీరింగ్ కళాశాలకు గ్రహణం..!

గిరిజన విద్యాభివృద్ధే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాలకు మోక్షం కలగడం లేదు. గత ప్రభుత్వం కళాశాల మంజూరు చేసిన తరువాత దాదాపు 80 శాతం పనులు పూర్తి కాగా మిగిలిన పనులు పూర్తి చేయడంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం అలక్ష్యం వహిస్తోంది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి రాజకీయ గ్రహణం పట్టిందని పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన ప్రజలు, పలుగిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కూటమి అధికారంలోకి వచ్చాక నిలిచిపోయిన పనులు
- ప్రభుత్వం స్పందించాలని గిరిజన సంఘాల డిమాండ్


చివరిదశలో నిర్మాణం నిలిచిపోయిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల


నిలిచిపోయిన విద్యార్థుల వసతి గృహ సముదాయం

కురుపాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినా నేటివరకు కురుపాంలో మంజూరైన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు పూర్తి కాకుండా నిలిచిపోయాయని ఆదివాసీ గిరిజనులు వాపోతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన విద్యాభివృద్ధే లక్ష్యంగా అప్పటి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి పట్టుబట్టి గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయించగా వెంటనే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కురుపాం నియోజకవర్గ కేంద్రం సమీపంలో టేకరఖండి గ్రామం వద్ద 105 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.153.853 కోట్ల అంచనా విలువతో పనులకు నిధులు మంజూచేసింది. కళాశాల పూర్తి నిర్వహణ బాధ్యతలను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూకే)కి ప్రభుత్వం అప్పగించింది. త్వరితగతిన కళాశాల పనులు పూర్తి చేసి తరగతులు ప్రారంభించాలని అప్పటి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదేశించింది. అప్పటినుంచి పనులు చురుగ్గా జరిగినా తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

జేఎన్‌టీయూకే నాలుగో క్యాంపస్‌గా కురుపాం కళాశాల

జేఎన్‌టీయూకే పరిధిలో ఇప్పటికే కాకినాడ, విజయనగరం, నర్సారావుపేటలో మూడు క్యాంపస్‌లు ఉండగా కురుపాం క్యాంపస్ నాలగవదిగా ఉంటుంది. కురుపాం క్యాంపస్‌లో గిరిజన విద్యార్థులకు ఐదు బ్రాంచిలైన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులను అందించేందుకు సిద్ధం చేశారు. ఒక్కో బ్రాంచికి 60 సీట్లు చొప్పున మొత్తం 300 సీట్లు ఉంటాయి. కురుపాం, పార్వతీపురం ప్రాంతాల గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టారు. కురుపాం ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయి తరగతులు ప్రారంభమైతే మన్యం జిల్లాలోని కురుపాం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల్లో గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కళాశాల ఎంతో ఉపయోగ పడుతుంది.

కాంట్రాక్టర్‌కు రూ.8 కోట్ల బకాయి

గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు నిలిచిపోయి రెండేళ్లవుతోంది. అలాగే కాంట్రాక్టర్‌కు కూడా సుమారు రూ.8 కోట్ల వరకు బకాయిలు ఉండిపోయాయి. దాదాపు 80 శాతం వరకు పనులు పూర్తి కాగా చివరి దశలో పనులు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దృష్టి సారించలేదని ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని మన్యం జిల్లా ప్రాంత ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడితే నిరుపేద గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అవకాశం ఉందని ఆ దిశగా చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇంజినీరింగ్ కళాశాల పనులు పూర్తి చేయాలి



కూటమి ప్రభుత్వం స్పందించి టేకరఖండి గ్రామ సమీపంలో చివరి దశలో నిలిచిపోయిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి, రాజకీయాలకు అతీతంగా గిరిజనాభివృద్ధే లక్ష్యంగా పనులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

ఇంటికుప్పల రామకృష్ణ,
ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు

వేయి కళ్లతో ఎదురు చూస్తున్న విద్యార్థులు



గిరిజన ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభం కోసం మన్యం జిల్లాలోని గిరిజన విద్యార్థులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉండగా ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చురుగ్గా పనులు చేపట్టి ఉన్నత విద్యను ఆదివాసీ ప్రాంతానికి అందుబాటులోకి తీసుకు రావాలి.

ఆరిక చంద్రశేఖర్,
గిరిజనాభ్యుదయ సంఘం, జిల్లా అధ్యక్షుడు

గిరిజన విద్యార్థుల చెంతకే ఉన్నత విద్య



గిరిజన ఇంజినీరింగ్ కళాశాల వల్ల ఆదివాసీ ప్రాంత విద్యార్థుల చెంతకే ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుంది. కనుక ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే కళాశాల నిర్మాణం పూర్తి చేసి, తరగతులను ప్రారంభించాలి. పనులు నిలిచి రెండేళ్లవుతోంది.

వల్ల సురేష్,
గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

స్కూల్‌గేమ్స్ పోటీల్లో సత్తా చాటాలి

- డిప్యూటీ డీఈఓ కె.వెంకటరమణ
- రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక ప్రారంభం


టేబుల్‌టెన్నిస్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు


మాల్కంబ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరగబోయే స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఉత్తమ క్రీడా ప్రతిభతో సత్తా చాటాలని డిప్యూటీ డీఈఓ కె.వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రస్థాయిలో నిర్వహించే స్కూల్‌గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను బుధవారం ఆయన నగరంలోని పీఎస్ఆర్ స్కూల్‌లో ప్రారంభించారు. టేబుల్ టెన్నిస్, మాలకంబ క్రీడాంశాల్లో అండర్-14,17 విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో టేబుల్‌టెన్నిస్ క్రీడాంశంలో 20 మంది, మాల్కంబ క్రీడాంశంలో 16 మంది క్రీడాకారులు జిల్లా జట్టుకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు సులభంగా లభిస్తాయన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కె.గోపాల్, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీలను టేబుల్‌టెన్నిస్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి, విజయనగరం డివిజన్ ఇన్‌చార్జి తవిటయ్య, రత్నకిషోర్, శ్రీను, రవి, ప్రవీణ్, శ్రీకాంత్‌లు పర్యవేక్షించారు.

సెపక్‌తక్రా పోటీల్లో 20 మంది ఎంపిక

నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సెపక్‌తక్రా అండర్-14,17 బాల, బాలికల ఎంపిక పోటీల్లో 20 మంది జిల్లా జట్టుకు అర్హత సాధించారు. ఎంపిక పోటీల్లో మొత్తం 50 మంది క్రీడాకారులు పాల్గొనగా..పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ధర్మారావు పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి. జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్నారు. ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావు తదితరులు పర్యవేక్షించారు.

గంజాయి కేసులో ముద్దాయికి 12 ఏళ్ల జైలు

- ప్రాసిక్యూషన్ జరుగుతుండగా మరో నిందితుడి మృతి


ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో 2018లో నమోదైన గంజాయి కేసులో ముద్దాయికి 12 ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ విజయనగరం ఒకటవ ఏడీజే ఎం.మీనాదేవి తీర్పు వెల్లడించారని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. ఎస్‌కోట స్టేషన్ పరిధి బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద సిబ్బందికి వచ్చిన కచ్చితమైన సమాచారంతో 2018 ఫిబ్రవరి 19 న వాహన తనిఖీలు చేస్తుండగా బొలెరో వ్యాన్ లో పశ్చిమ బెంగాల్ కు చెందిన సంతు ముజిందార్ (36), ఏఎస్ఆర్ జిల్లా జీకే వీధి మండలం దుప్పలవాడకు చెందిన పంగి ధనుంజయ్ (24) గంజాయి రవాణా చేస్తూ పట్టుబడగా వారి నుంచి 66.2 కిలోల గంజాయిని ఎస్.కోట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్.కోట సీఐ వై.రవికుమార్ నిందితులను రిమాండ్‌కు తరలించి, న్యాయస్థానంలో నిందితులపై అభియోగ పత్రం దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్‌లో నిందితుడు (ఎ2) పంగి ధనుంజయ్ పై నేరారోపణలు రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ జడ్జి ఎం.మీనాదేవి తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు (ఎ1) సంతు ముజిందార్ ప్రాసిక్యూషన్ సమయంలో మరణించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నిందితుడు (ఎ2) పంగి ధనుంజయ్‌కు శిక్ష పడేలా చర్యలు చేపట్టిన పోలీస్ అధికారులు, సిబ్బంది, ఏపీపీని ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

దోపిడీ, హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

జిల్లాలోని కొత్తవలస కుమ్మరివీధిలో ఉంటున్న ఒక మహిళపై 2023లో దాడికి పాల్పడి, బంగారు వస్తువులను దోపిడీ చేసిన ఎల్.కోట మండలం జమ్మాదేవి పేటకు చెందిన నిందితుడు మడబత్తుల కృష్ణ (34)కు విజయనగరం 5వ ఏడీజే కోర్టు జడ్జి ఎస్.పద్మావతి జీవిత ఖైదు , రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. కొత్తవలస కుమ్మరివీధిలో మడబత్తుల సూర్యకాంతం తన కొడుకుతో కలిసి నివాసం ఉంటోంది. 2023 ఏప్రిల్ 15వతేదీన గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలోనికి చొరబడి, ఆమె తలపై కొట్టి, కంట్లో కారం జల్లి, మెడలో బంగారు పుస్తెల తాడు, చెవిదిద్దులను అపహరించికుని పారిపోయాడు. గాయపడ్డ ఆమెను చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా మృతిచెందినట్లు ఆమె అన్నయ్య సూడా అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదుపై దోపిడీ చేసి, హత్యకు పాల్పడినట్లు కొత్తవలస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టిన అప్పటి కొత్తవలస సీఐ బాల సూర్యారావు విచారణ చేసి, నిందితుడు కృష్ణను అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేయగా నేరం రుజువు కావడంతో జడ్జి ఎస్.పద్మావతి పైవిధంగా తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు.

ఒకే రైతుకు 50 బస్తాల యూరియా విక్రయం

- విచారణ చేసిన విజిలెన్స్, వ్యవసాయ అధికారులు
- ఎరువుల దుకాణ డీలర్‌పై చర్యలకు సిఫార్సు


ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

తెర్లాం: మండలంలోని సుందరాడ గ్రామంలోని ఎరువుల దుకాణ డీలర్‌పై చర్యలకు విజిలెన్స్, వ్యవసాయ అధికారులు సిపార్సు చేశారు. దీనికి సంబంధించి మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎరువుల దుకాణ డీలర్ ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఒకే రైతుకు 50 యూరియా బస్తాలు విక్రయించినట్లు ఈపోస్ యంత్రంలో నమోదు చేశాడు. దీనిని గుర్తించిన విజిలెన్స్ అధికారులు ఎరువుల డీలర్‌పై దర్యాప్తు నిమిత్తం వచ్చారు. ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్-1985 ప్రకారం ఒక రైతుకు ఎక్కువ యూరియా బస్తాలు విక్రయించడం నేరం కావడంతో దీనిపై మండల వ్యవసాయ అధికారి బొత్స శ్రీనివాసరావు, విజిలెన్స్ కానిస్టేబుల్ తిరుపతిరావు, సుందరాడ వీఏఏ దేముడు గ్రామానికి వచ్చి ఎరువుల దుకాణ డీలర్ వద్ద ఉన్న రికార్డులను గ్రామ పెద్దలు, రైతుల సమక్షంలో తనిఖీ చేశారు. ఎరువుల దుకాణ డీలర్ ఒక రైతుకు 50బస్తాల యూరియా విక్రయించినట్లు రికార్డుల్లో నమోదు కావడంపై అతనిపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు విజిలెన్స్, వ్యవసాయ అధికారులు తెలిపారు.

14న సాయి వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

విజయనగరం: విశాఖ పోర్ట్ స్టేడియంలో గల సాయి వాలీబాల్ హాస్టల్‌లో ప్రవేశాలకు ఈనెల 14న బాల,బాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, కేవీఎన్ చిన్నారిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలలోపు వయస్సు గల క్రీడాకారులు మాత్రమే ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనబోయే బాలురు 190 సెంటీమీటర్లు, బాలికలు 170 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, గతంలో వాలీబాల్ క్రీడలో సాధించిన సర్టిఫికెట్‌లను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఆసక్తి గల క్రీడాకారులు 14న విశాఖ పోర్ట్ స్టేడియంలో జరిగే ఎంపికల్లో పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8919421590 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

- మరో ముగ్గురికి గాయాలు


గాయాల పాలైన వారికి సపర్యలు చేస్తున్న పెద్దబంటుపల్లి గ్రామస్తులు

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి ప్రధానరహదారిలో బుధవారం ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలకు మేరకు..మెరకముడిదాం నుంచి గరివిడి వస్తున్న ఆటోకు పెద్దబంటుపల్లి వద్ద అడ్డంగా కుక్క రావడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మెరకముడిదాం మండలం సింగవరం గ్రామానికి చెందిన మన్యపురి తవిటినాయుడు (59) మృతి చెందాడు. గాయాలపాలైన ముగ్గురిని చీపురుపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన బాలుడు కిరణ్

తీవ్రజ్వరంతో బాలుడు..

రేగిడి: మండల పరిధిలోని అంబాడ గ్రామానికి చెందిన ముడిదాన కిరణ్ (6) తీవ్ర జ్వరంతో మృతిచెందాడని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న కిరణ్ మృతి వార్త తెలుసుకుని కుటుంబ సభ్యులను హెచ్‌ఎం మీసాల సత్యంనాయుడుతో కలిసి ఆయన పరామర్శించారు. వేకువజామున నాలుగు గంటల సమయంలో గుండెలో నొప్పి వచ్చిందని, అనంతరం వాంతులు కావడంతో అపస్మారకస్థితికి చేరుకోగా కుటుంబ సభ్యులు రాజాం కేర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతిచెందాడని వైద్యులు తెలిపారని ఎంఈఓ పేర్కొన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు ఎం.సింహాచలం, డి.ప్రసాద్, బాలుడు తండ్రి జోగినాయుడు తదితరులు పరామర్శలో పాల్గొన్నారు.

విష్కరణలకు ఏఐ విద్య కీలకం

విజయనగరం అర్బన్: ఆవిష్కరణలు, కెరీర్ల రూపురేఖలకు కృత్రిమ మేధస్సు (ఏఐ) విద్య కీలకంగా నిలుస్తుందని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ వ్యవస్థాపక విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రవి సరేపల్లి అన్నారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇన్‌స్పైర్ టు ఇన్నోవేటివ్' అనే అంశంపై బుధవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచాన్ని మార్చేది ఆవిష్కరణలేనని అది కొత్త ఆలోచనలు, కొత్త సాంకేతికతల ద్వారానే సాధ్యమని అన్నారు. ఏఐ 30 సెకన్లలో 90 శాతం కోడ్ రాసే సామర్థ్యాన్ని సాధించిందని దీంతో కాంపిటేటివ్ కోడర్లు భర్తీ అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వైద్య రంగంలో ఏఐ రోగుల నిర్ధారణ, చికిత్సలో విప్లవాత్మక మార్పులు తెస్తోందని చెప్పారు. ఏఐ ట్యూటర్లు పెరుగుతున్నా, మానవ స్పర్శ మాత్రం విలువైనదేనని ఆయన స్పష్టం చేశారు. ఆవిష్కరణ ఫలితంగా మైండ్ కంట్రోల్డ్ ప్రోస్తెటిక్ అవయవాల అభివృద్ధిని ఉదాహరణగా చూపారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మెంటాడ: మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన కుమిలి అప్పరావు కుమారుడు సంతోష్(35) అవివాహితుడు. మంగళవారం రాత్రి 11గంటలకు కుటుంబసమస్యల వల్ల మద్యం మత్తులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు వెంటనే గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సీతారాం తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక


బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్సై అనీష్, సిబ్బంది

జియ్యమ్మవలస: చినమేరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక అదృశ్యమైందని మంగళవారం తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై అనీష్ కేసు నమోదు చేఇరు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ రాంబాబు, సీఐ తిరుపతిరావు సూచనల మేరకు ఎస్సై అనీష్, సిబ్బంది గాలించి కైకలూరు మండలం గుమ్మలపాడులో బుధవారం బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేక డ్రైవ్


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్

కురుపాం: మద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికార అమ్మకాలు (బెల్ట్ షాపులు) నిర్వహిస్తున్న వారి కోసం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై ఐదు రోజుల పాటు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి 32 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేసినా, గొలుసు దుకాణాల నిర్వహణకు వేలం పాట నిర్వహిస్తున్నా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జె.రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.